క్లుప్తంగా

27న రథయాత్ర

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో ఈ నెల 27వ తేదీన జగన్నాథస్వామి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గిరిధర పాత్రో ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారని, ఈ ఏడాది కూడా ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రథం తయారీ పనులు కొనసాగుతున్నాయన్నారు.

పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు శనివారం పోటెత్తారు. పవిత్ర శనివారం కావడంతో మండల పరిసర ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుమురై తదితర పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. భక్తులు క్యూలైన్‌లో వెళ్లి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంచిపెట్టారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



నినాదాలు చేస్తున్న అధికారులు

భామిని: పరిసరాల పరిశుభ్రతతో మన ఆరోగ్యం ముడిపడి ఉందని అధికారులు తెలిపారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావు, డీటీ శంకరరాయుడు, ఏపీఓ బాబూరావు, ఏఈ చంద్రశేఖరనాయుడు, కుట్టు శిక్షణ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు పలువురి ఎంపిక



నియామకపత్రాలు చూపిస్తున్న ఎంపికైన విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ ఉద్యోగాలకు 49 మంది ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం. గోపాలకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీషిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు చేపట్టిన ఇంటర్వ్యూకు మొత్తం 86 మంది హాజరుకాగా వారిలో 49 మంది ఎంపికయ్యారన్నారు. అనంతరం ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు.

మాజీ సర్పంచ్ మృతి



కృష్ణారావు(ఫైల్)

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలంలోని జరడ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఊయక కృష్ణారావు (40) శనివారం మృతి చెందారు. ఈ మేరకు పలువురు నాయకులు, గ్రామస్తులు ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పరామర్శ



నేరడి-బిలో మృతురాలు జయమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని నేరడి -బికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు జగశెట్టి జయమ్మ (58), చిన్నదిమిలికి చెందిన చీడి అనురాధ (40) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పార్టీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, మండల నాయకులు పిన్నింటి హరిబాబు, అగతముడి రఘు, అర్లి రాజు, జగుశెట్టి గిరి, అంగూరు వైకుంఠరావు, చెక్కా శ్రీను, గెల్లంకి రమేష్, కాగితాపల్లి కృష్ణారావు ఉన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

మక్కువ: మండల కేంద్రంలో ఈవో బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇంచార్జ్ తహసీల్దార్ హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: కొండాపురంలో యోగా చేస్తున్న మహిళలు



గుమ్మలక్ష్మీపురంలోని కల్యాణ మండపంలో యోగా సాధన చేస్తున్న ఔత్సాహికులు



గరుగుబిల్లి: రావివలసలో యోగాసనాలు సాధన చేస్తున్న గ్రామస్తులు

ఆరోగ్య యోగ

వాడవాడలా అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా కార్యక్రమంలో పాల్గొని, యోగా విశిష్టతను తెలియజేశారు. యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతిఒక్కరూ తమ జీవనశైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. పలువురు యోగా గురువులు, విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



పాలకొండ రూరల్: ఎం.సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పంటల పాలిట శత్రువు.. వయ్యారిభామ!

- వయ్యారిభామ మొక్కలతో పంట నష్టం
- మూగజీవాలు, మనుషులకూ ప్రమాదమే..
- పూతకు ముందే పీకేయాలని నిపుణుల సూచన

గరుగుబిల్లి:

వర్షాలు పడుతున్నాయంటే చాలు.. రైతులు ముందుగా భయపడేది వయ్యారిభామ(పార్థీనియం) కలుపుమొక్కల గురించే. అక్కడా, ఇక్కడా అని తేడా లేకుండా ఎక్కడైనా ఈ మొక్క పెరిగేస్తుంటుంది. ఈ కలుపు మొక్క ప్రధాన పంటకు నష్టం కలిగిస్తుంది. మొలిచిన నెల రోజుల్లోనే పూతకు వస్తుంది. ఒక్కో మొక్క 50 వేల విత్తనాలను ఉత్పత్తి చేయడంతో పాటు దూరప్రాంతాలకు సైతం తేలికగా వ్యాపిస్తుంది. పంట నష్టం కలిగించే ఈ మొక్క గురించి మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న తెలిపిన వివరాలిలా..

మనుషులకు జ్వరం, ఉబ్బసం..

వయ్యారిభామ వల్ల పంట మొక్కలకే కాదు మనుషులు, పశువులకూ ముప్పే. మనుషులకు అయితే జ్వరం, ఉబ్బసం వంటి వ్యాధులతో పాటు చర్మ సంబంధిత అలర్జీ వస్తుంది. జలుబు, కళ్ల ఎర్రబడడం, కనురెప్పలవాపు తదితర సమస్యలు వస్తాయి. ఈ మొక్కలు తినే పశువులు అయితే హైపర్‌టెన్షన్‌కు గురవుతాయి. ఇక పంటల విషయానికి వస్తే నీరు, పోషకాల కోసం పంట మొక్కలతో పోటీ పడతాయి తద్వారా దిగుబడులు 40 శాతం వరకు తగ్గుతాయి. వంగ, మిరప, టమాటా, మొక్కజొన్న పైర్లు పూత దశలో ఉన్నప్పుడు వాటిపై వయ్యారిభామ పుప్పొడి పడితే ఉత్పత్తి తగ్గుతుంది. పైర్లకు మొవ్వ, కాండం కుళ్లు తెగుళ్లు సోకవచ్చు. ఈ మొక్కలు పశుగ్రాస పంటలకు కూడా నష్టం కలిగిస్తాయి. ఈ మొక్కల్ని నిర్మూలించాలంటే రైతులు తప్పనిసరిగా సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



వయ్యారిభామ మొక్క

ఏం చేయాలి..?

వయ్యారిభామ మొక్కలు తక్కువ సంఖ్యలో ఉన్నట్లయితే వాటిని చేతితో పీకేయాలి. మొక్కలు పూతదశకు రాకముందే పీకి తగలబెట్టాలి. లేకుంటే వాటి వ్యాప్తిని నివారించడం కష్టం. ఒకవేళ పూత దశకు చేరుకున్న తర్వాత మొక్కలను పీకినట్లయితే వాటిని వెంటనే కుప్పగా వేసి తగలబెట్టాలి.

రసాయనాలతో..

మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాల పంటల్లో విత్తనాలు మొలక రాకముందు లీటరు నీటికి 4 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేస్తే వయ్యారిభామ మొక్కల బెడద ఉండదు. విత్తనాలు మొలకెత్తిన 15–20 రోజులకు లీటరు నీటికి 2 ఎంఎల్ పేరాక్వాట్ మందును కలిపి పిచికారీ చేసుకోవచ్చు. పశుగ్రాసం వేసేవారు పైరు వేయకముందే లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి స్ప్రే చేయాలి.

కంపోస్ట్ తయారీ..

వయ్యారిభామ మొక్కలు ఎంతో హానికరమైనప్పటికీ వాటిని ఉపయోగించి కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు. దీనికోసం నీరు నిలవని చోట 3 మీటర్ల లోతు, 6 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు ఉండేలా గుంత తవ్వాలి. ఇందులో 50 కిలోల వయ్యారిభామ మొక్కలను వేసి, వాటిపై 5 కిలోల యూరియా చల్లుకోవాలి. అలాగే 50 గ్రాముల ట్రైకోడెర్మా విరిడె కూడా చల్లాలి. ఈ విధంగా పొరలు, పొరలుగా గుంతను దోమ ఆకారంలో నింపుకోవాలి. పొరలపైన పేడ, మట్టి, ఊక మిశ్రమాన్ని వేసి కప్పేయాలి. నాలుగైదు నెలల్లో కంపోస్ట్ తయారవుతుంది. దానిని జల్లెడ పట్టి పంటకు వేసుకోవాలి. ఈ కంపోస్ట్‌లో నత్రజని, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం పోషకాలు అధికంగా ఉంటాయి. కంపోస్ట్‌ను తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని అన్ని పంటలకూ వేసుకోవచ్చు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి..

- డాక్టర్ రవీంద్రకుమార్

పాలకొండ: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు జె. రవీంద్రకుమార్ అన్నారు. శనివారం స్థానిక రుషి యోగా కేంద్రం ఆధ్వర్యంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాన ఆవశ్యకతను వివరించారు. యోగా కేంద్రం వ్యవస్థాపకుడు పల్లా కొండలరావు మాట్లాడుతూ.. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎస్సై ప్రయోగమూర్తి మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన పల్లా కొండలరావు యువసేన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం 70 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ చిరంజీవి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై, తదితరులు

నవధాన్యాల పంపిణీ



నవధాన్యాల కిట్లుతో రైతులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడ పంచాయతీ, అడ్డంగూడలోని రైతులకు శనివారం నవధాన్యాలు పంపిణీ చేశారు. ఏపీసీఎన్‌ఎఫ్ గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌చార్జ్ కిమిడి భూషణ్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు ద్వారా నేల సారవంతమవుతుందని, తద్వారా పంటలు బాగా పండుతాయని తెలిపారు. ఎకరాకు 18 నుంచి 30 రకాల విత్తనాలను 18 కిలోల నుంచి నవధాన్యాల విత్తనాలు వేసుకోవాలని, 45 రోజుల తర్వాత పెరిగిన మొక్కలను అదే నేలలో కలియదున్నితే భూసారం పెరుగుతుందన్నారు. నవధాన్యాల సాగు తర్వాత వేసే పంటకు పుష్కలంగా నేల నుంచి కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన అంతా మోసమే..!



భామినిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: కూటమి నాయకులు ఏడాది కాలంగా ప్రజలను మోసం చేసూ వస్తున్నారని పాలకొండ మాజీ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, మండల నాయకులు పిన్నింటి హరిబాబు, అగతముడి రఘులతో కలిసి మండల కేంద్రంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేని స్థితిలో ఉన్న కూటమి నాయకులు ఆర్థిక సూత్రాలు వల్లించడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి సంగతేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈ నెల 23న జిల్లా కేంద్రంలో యువతపోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మ ఒడి పథకాన్ని తల్లికివందనంగా పేరు మార్చి ఎంతోమంది తల్లులను చంద్రబాబు మోసం చేశాడని ఆరోపించారు. భర్తలను పోగొట్టుకున్న వితంతువులకు కనీసం పెన్షన్ కూడా ఇవ్వలేని స్థితిలో ఉందని కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అర్లి రాజశేఖర్, చెక్కా శ్రీను, జగశెట్టి గిరి తదితరులు పాల్గొన్నారు.

అవన్నీ తప్పుడు ప్రచారాలే..

- గాయత్రీ స్కూల్ విద్యార్థులకు సైనిక్ స్కూల్ సీట్లు రాలేదు
- ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి
- సాక్షిలో వచ్చిన వరుస కథనాలతో కదిలిన విద్యాశాఖ అధికారులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని గాయత్రీ స్కూల్ నిర్వాహకులు తమ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులకు ఈ ఏడాది సైనిక స్కూల్‌లో సీట్లు వచ్చినట్లు తప్పుడు ప్రచారం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి, వీరఘట్టం ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్. ఆనందరావు శనివారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సైనిక్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థుల గురించి ఆటో ద్వారా ప్రచారం చేశారు కదా.. ఆ వివరాలు ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరగా.. ఎవ్వరికీ సీట్లు రాలేదని యాజమాన్యం ఒప్పుకుందని ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి తెలిపారు. తప్పుడు ప్రచారం చట్ట విరుద్ధమని అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉంటే ఇక్కడ కొత్తగా నిర్మించిన బిల్డింగ్‌కు ఎటువంటి అనుమతులు లేవని పంచాయతీ అధికారులు తెలియజేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు తెలిజేస్తామని అధికారులు తెలిపారు.



గాయత్రీ పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న పాలకొండ ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు..

ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ల కోసం తప్పుడు ప్రచారాలు చేస్తుంటారని, ఇటువంటి వాటిని నమ్మవద్దని డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి ప్రజలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు నిపుణులైన ఉపాధ్యాయులచే బోధన ఉంటుందని, తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

రేపటి యువత పోరుకు తరలిరండి



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- కూటమి ప్రభుత్వంలో యువతకు వెన్నుపోటు
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్:

గత ఎన్నికల వేళ కూటమి నేతలు నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మరిచారని, వెన్నుపోటు పొడిచారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ధ్వజమెత్తారు. దీన్ని నిరసిస్తూ ఈ నెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత పోరుకు సంబంధించి తన కార్యాలయంలో పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పోరులో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. చంద్రబాబు ఏడాది కాలంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించకుండా నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి ఎగనామం పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా విద్యార్థులను, యువతను మోసం చేస్తున్న వైనాన్ని నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యువత సత్తా కూటమి ప్రభుత్వానికి తెలియజేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి యువత పెద్ద సంఖ్యలో తరలి రావాలని నగిరెడ్డి శరత్‌బాబు పిలుపునిచ్చారు. యువత పోరును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలోని ప్రతీ ఒక్క వార్డు నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ పార్టీ శ్రేణులు అంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పల్లా అనంత్ నాయుడు, పార్వతీపురం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు కోరాడ శేఖర్, పురపాలక సంఘం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ముగడ జగన్‌మోహన్‌రావు, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు కోరాడ శ్రీనివాసరావు ఎస్.లావణ్య, చీకటి అనురాధ, ఎస్.సుధీర్, వి.నేతాజీ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు శంకర్ సంతోష్, వివిధ విభాగాల అధ్యక్షులు, పార్టీ ప్రతినిధులు, వార్డు ఇంచార్జ్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుచ్చయ్య చౌదరి మాటలు సరికాదు..



మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: అధికార మదంతో టీడీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ సీనియర్ నేత ఎమ్మెల్యే గోరెట్ల బుచ్చయ్య చౌదరి మా అధినాయకుడు జగన్ మోహన్‌రెడ్డిపై చంపుతాం, నరుకుతాం అని చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. గతంలో గౌరవ ప్రదమైన స్పీకర్ పదవిలో ఉన్న అయ్యన్నపాత్రుడు జగన్‌మోహన్‌రెడ్డిపై ఆయన చనిపోలేదు, ఓడిపోయాడంతే అనే వ్యాఖ్యలు కూడా ప్రజలు గమనించారని అన్నారు. ముఖ్యమంత్రిగా రాజ్యాంగ బద్ధమైన ప్రమాణం చేసిన చంద్రబాబు సైతం భూస్థాపితం చేస్తామన్న వ్యాఖ్యలు చేయడం, పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన నాయకుడు తలలు తీస్తాం అన్న వ్యాఖ్యల సైతం పట్టించుకోని కూటమి నాయకులు ఇటీవల పల్నాడులో జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ కార్యకర్త చూపించిన ప్లకార్డును జగన్ మోహన్‌రెడ్డికి ఆపాదించడం ఎంతవరకు సమంజసమో కూటమి నాయకులు పరిశీలించుకోవాలన్నారు. ప్లకార్డు చూపించిన వ్యక్తి గతంలో స్థానిక ఎమ్మెల్యే అనుచరుడిగా టీడీపీ కార్యకర్తగా ఉన్నారని గుర్తు చేశారు. కూటమి పాలన నచ్చకో లేదా విసుగు చెందో తమ పార్టీపై ఈ విధంగా సినిమాలో డైలాగ్‌ను ప్లకార్డుగా చూపిస్తూ భావ వ్యక్తీకరణ చేస్తే దాన్ని పరిశీలించుకోవల్సిన కూటమి నాయకులు మా నాయకుడిపై బురదజల్లేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలనలో వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత నాయకులపై సైతం అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టే పరిస్థితి నెలకొందన్నారు.

జాయింట్ పట్టాలను విడదీసేందుకు అవకాశం

సీతానగరం: మండలంలో రీ సర్వే అయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన రైతులకు జాయింట్ ఉన్న వాటిని విడకొట్టడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఇంచార్జ్ తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రీసర్వే అయిన భూములు జాయింట్‌గా ఉన్నాయని రైతులు రుణాలు పొందడానికి, ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందడానికి సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తున్నాయని రైతుల నుంచి వినతులు రావడంతో వెసులుబాటు కల్పించిందన్నారు. రెవెన్యూ సబ్ డివి జన్ సేవలు నిమిత్తం నిర్ధారించిన రూ.500లకు బదులుగా కేవలం అర్జీతో పాటు రూ.50లు రుసుం సచివాలయంలో చెల్లించాలన్నారు. దీంతో జాయింట్ పట్టాదారు భూములున్న రైతులు సబ్ డివిజన్ చేయించుకుని సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని టీకే జమ్ము, అర్నాడ, అలమండ, పెదతోలుమండ గ్రామాల్లో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.ధర్మారావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సభలు నిర్వహిస్తున్నామని, 23న టీకే జమ్ము, 24న పెదతోలుమండ, 25, 26వ తేదీల్లో అర్నాడ, 27, 28వ తేదీల్లో అలమండ ప్రాంతాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.